# జహీరాబాద్ త్రివేణివనం ప్రారంభం

- ఎకో పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్
- పాల్గొన్న జహీరాబాద్ ఎంపి సురేష్ షేట్కార్, టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

**విశ్వంభర, జహీరాబాద్ :** జహీరాబాద్ పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న త్రివేణివనం ఫారెస్ట్ ఎకో పార్కును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైద్రాబాద్ నుండి వర్చువల్‌గా ప్రారంభించారు.ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చని వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 11 ఎకో పార్కులను ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించడం సంతోషకరమన్నారు.జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ ద్వారా పారిశ్రామిక స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకుంటోందని, భారీ పరిశ్రమలు రావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కనే 208 ఎకరాల విస్తీర్ణంలో త్రివేణివనం అటవీ ఎకో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో ఉన్న అన్ని సౌకర్యాలు త్రివేణివనంలో కల్పించినునట్లు చెప్పారు.టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్లు, అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించే అలవాటు చేసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే ఉన్న త్రివేణివనం ఫారెస్ట్ ఎకో పార్కు ఎంతో ఆకర్షణీయంగా అభివృద్ధి చేయబడిందన్నారు. పార్కులో సైక్లింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి పార్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.అనంతరం అటవీ శాఖ రూపొందించిన వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిమ్మట సఫారీ వాహనంలో ఎకో పార్కును సందర్శించి వివిధ సౌకర్యాలను పరిశీలించడంతో పాటు మొక్కలు నాటారు. అనంతరం జెండా ఊపి సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్మన్ యూనిస్, ఉజ్వల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన ధరలు తగ్గించలేం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** అమెరికా ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెర పడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు దిగిరానున్నాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గినా.. భారత్‌లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది. పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ ఇటీవల ఇంధన ధరలు పెంచడంపై గురువారం మాట్లాడారు. లీటరుకు దాదాపు రూ.3.94 మాత్రమే పెంచామన్నారు. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన.. ఆ పెంపును వెంటనే తగ్గించలేమన్నారు. హర్మూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ.. ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరకు లభించే ముడి చమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. ఇలా పలు అంశాల పల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని స్పష్టంచేశారు. ఇక, పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలోని చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. ఆ సమయంలో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ రాష్ట్రం ముందుకు రాలేదన్నారు. దీంతో ఆ భారమంతా కేంద్రంపై పడిందన్నారు. దీని కారణంగా కేంద్రం రూ.12వేల కోట్ల మేర ఆదాయం కోల్పోయిందన్నారు.

## వెంకటేశ్వరాకాలనీ వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

**విశ్వంభర, సరూర్ నగర్ :** సరూర్ నగర్ డివిజన్ లోని అతిపెద్ద కాలనీ అయినటువంటి శ్రీవెంకటేశ్వరకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (2026 నుండి 2028) నూతన కమిటీ ప్రమాణ స్వీకర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అధ్యక్షునిగా గండు ధనంరెడ్డి, గౌరవ అధ్యక్షునిగా బోయిన మహేందర్ యాదవ్, ఉపాధ్యక్షునిగా మునగాల నరేష్, ప్రధాన కార్యదర్శిగా పివిఎస్ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీలుగా వడ్రీ సుబ్రమణ్యం, సప్పిడి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా సోమ వెంకటేశ్వర్లు, సలహాదారునిగా తులసీ క్రిష్ణమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.శ్రీనివాస్ రావు, ఎక్సిక్యూటీవ్ కమిటీ మెంబర్లుగా టి.శ్రీనివాస్ కార్తిక్, ఎన్. గణేష్ యాదవ్, జి.ప్రవీణ్ కుమార్, ఎం. సుధాకర్చారీ, కె.రవిగౌడ్, టి.నాగ అజయ్ గోపి, సోమ ప్రవీణ్ కుమార్, కె.నవీన్ చంద్ర, ఎన్.ఎస్.వి.రవి, సిహెచ్.సురెందర్రాజు, చెన్న అనిల్, వి.ఎ.వంశీమోహన్, డి.వి.శ్రీనివాస్, ఎం. లింగరావులు ప్రమాణస్వీకారం చేశారు. ఎలక్షన్ అధికారి ఎం. శాంతి ప్రసాద్ గెలుపొందిన నూతన కమిటీచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ పెద్దలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మారోజు శ్రీనివాస్ రావు, కనకారావు, సాయి కిరణ్, రవికుమార్, మురళికొండిన్య, బోగేశ్వర్రావు,మాధవరావులతో పాటు కాలనీ వాసులు కమిటీ కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## శంషాబాద్ జోనల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా వేముల రాఘవేందర్ ఏకగ్రీవ ఎన్నిక

**విశ్వంభర, శంషాబాద్ :** శంషాబాద్ జోనల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ప్రముఖ కాంట్రాక్టర్ వేముల రాఘవేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిహెచ్ఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సీనియర్ నాయకులు హనుమాన్ సాగర్, సుంకరి సత్తయ్య ల ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. శంషాబాద్ జోన్ పరిధిలోకి వచ్చే నాలుగు ముఖ్యమైన సర్కిళ్లు — ఆదిబట్ల, బడంగ్‌పేట్, శంషాబాద్, జల్ పల్లి కాంట్రాక్టర్లందరూ ఏకతాటిపైకి వచ్చి, వేముల రాఘవేందర్ నాయకత్వాన్ని ఏకగ్రీవంగా సమర్థిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వేముల రాఘవేందర్ మాట్లాడుతూ.. "నాపై నమ్మకంతో శంషాబాద్ జోనల్ పరిధిలోని నాలుగు సర్కిళ్ల కాంట్రాక్టర్లు నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు .నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటాను అని అన్నారు.అసోసియేషన్ బలోపేతానికి, సభ్యులందరి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణాధికారులు హనుమాన్ సాగర్, సుంకరి సత్తయ్య, ఆదిబట్ల, బడంగ్‌పేట్, శంషాబాద్, జల్‌పల్లి సర్కిళ్లకు చెందిన వందలాది మంది కాంట్రాక్టర్లు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్య పురస్కారానికి ఎంపికైన వైరాగ్యం ప్రభాకర్

**విశ్వంభర, హైదరాబాద్ :** కరీంనగర్ కు చెందిన కవి రచయిత విమర్శకులు, శతాధిక గ్రంథ ప్రచురణ కర్త, భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ సాహిత్య రంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ శ్రీ సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డికి చెందిన ప్రముఖ కవి, రచయిత శ్రీ సిరిగాద శంకర్ నెలకొల్పిన ఈ పురస్కారాన్ని ఈ నెల 24, బుధవారం రోజున సాయంత్రం 6 గంటలకు శ్రీ త్యాగరాయ గానసభ కళా సుబ్బారావు కళా వేదికపై జరుగనున్న సాహితీ కిరణం 17 వ వార్షికోత్సవ వేడుకల సభలో ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కె.వి.రమణ చేతులమీదుగా అందించనున్నామని తెలిపారు. నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు సభాధ్యక్షులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షులు శ్రీ కళా వి.ఎస్.జనార్దనమూర్తి, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సాహితీవేత్త డా.వై. రామకృష్ణారావు, ప్రత్యేక అతిథిగా వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు శిరోమణి డా.వంశీ రామరాజు,సభా ప్రారంభకులుగా సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, కార్యక్రమ నిర్వాహకులుగా సాహితీ కిరణం సలహాదారు పెద్దూరి వెంకట దాసు హాజరవుతారని, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయని తెలిపారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : కాచం సుష్మ

**విశ్వంభర, చైతన్య పురి :** మహిళలు అన్ని రంగాల్లో రాణించి ప్రతిభను చాటాలని కాచం సుష్మ అన్నారు. గురువారం చైతన్యపురి న్యూ మారుతి నగర్ మహిళా భవన్ లో "ఇష్ట లేడీస్ కిట్టి గ్రూప్" కాచం సుష్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాదాపు 180 మంది మహిళలు హాజరయ్యారు. వీరికి ప్రోత్సాహక బహుమతులను చైతన్యపురిలోని వైశ్యరాజు జ్యూలరీ షోరూమ్ వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుజాత, శిరీష, విజయలక్ష్మి, కమల, కవిత, ధనలక్ష్మి, సులోచన, సత్యలక్ష్మి, అరుణ, వైశ్యరాజు జువెలరీ షోరూం బిజినెస్ హెడ్ సంతోష్, ఫ్లోర్ మేనేజర్ పవన్ కళ్యాణ్, సిబ్బంది నరేష్, హీన, శ్రీకాంత్, శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

## హన్విక ఫ్లవర్ డెకరేటర్స్ దుకాణాన్ని ప్రారంభించిన టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి

**విశ్వంభర, నాగోల్ :** కొత్తపేట నాగోల్ రోడ్‌లోని బడుగుల సందీప్ నూతనంగా ఏర్పాటు చేసిన హన్విక ఫ్లవర్ డెకరేటర్స్ దుకాణాన్ని ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా, సరికొత్త డిజైన్లు ఉత్తమ సేవలతో ఈ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్వయం ఉపాధితో పాటు నలుగురికి ఉపాధి కల్పించేలా వ్యాపార రంగంలో అడుగుపెట్టిన యువ నిర్వాహకులు బి. సందీప్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వ్యాపారంలో వారు మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్, తలాటి రమేష్, ముప్పిడి లింగస్వామి గౌడ్, బొడ్డుపల్లి మహేందర్, రాజు నాయక్, పందుల వెంకటేష్ గౌడ్, షఫీ, సుదర్శన్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ విశ్రాంతుల డిమాండ్ల పరిష్కారం కోసం దీక్ష

**విశ్వంభర, హైదరాబాద్ :** "బకాయిలు వెంటనే చెల్లించాలి.. పెన్షన్ సమస్యలు పరిష్కరించాలి" అంటూ తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సారధ్య కమిటీ ప్రతినిధులు పట్టాభి లక్ష్మయ్య, పి.వి. రంగారావు, చంద్రారెడ్డి, వెంగళ కనకయ్య, కట్ట ప్రకాష్ సత్యపాల్, అమీర్ అలీ, చిన్నయ్య, నజీరుద్దీన్ డిమాండ్ చేశారు. హైదరాబాదు రాంనగర్‌లోని బస్ భవన్ ముందు గురువారం నిర్వహించిన సామూహిక ఉపవాస దీక్షలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందలాది మంది విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. 2017 నుంచి ఏప్రిల్ 24 వరకు రిటైర్డ్ అయిన వారికి రావాల్సిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. మే 26 వరకు ఉన్న టెర్మినల్ బెనిఫిట్స్‌ను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని పేర్కొన్నారు. డిసెంబర్ 25 నుంచి మే 26 వరకు రిటైర్డ్ అయిన ఉద్యోగుల సెటిల్మెంట్ బకాయిలు చెల్లించడంతో పాటు, 2013, 2017 జీతభత్యాల సవరణ వివరాలను పీఎఫ్ కమిషనర్‌కు పంపించి పెన్షన్ పెంపు కల్పించాలని డిమాండ్ చేశారు. తిరస్కరించబడిన పీఎఫ్ పెన్షన్ దరఖాస్తులను సరిచేసి హయ్యర్ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లను ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేశారు. ఉపవాస దీక్ష సందర్భంగా భూపాలపల్లి డిపో ఏడీసీ బి. శంకర్ అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కిందపడిపోయారు. వెంటనే తోటి ఉద్యోగులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో: పట్టాభి లక్ష్మయ్య, పి.వి. రంగారావు, చంద్రారెడ్డి, అమీర్ అలీ, చిన్నయ్య, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహితం కృష్ణాభిమతం

**విశ్వంభర, నాగోల్ :** నాగోల్ ఆర్ టి వో హైదరాబాద్ ఈస్ట్ జోన్ రీజినల్ కార్యాలయం లో ఆర్టీవో కొండయ్య కు , మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లకు, స్టాప్ కు 25 కేజీల లగేజీ మోయగలిగిన పర్యావరణ క్లాత్ బ్యాగ్ లను గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ , 400 పాత్రల నటుడు, పర్యావరణవేత్త, విభిన్న పాత్రాభినయ కళాకారులు, రచయిత డా,, పెండెం కృష్ణకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ టి వో కొండయ్య మాట్లాడుతూ డా,, పెండెం కృష్ణకుమార్ గతంలో అనేక సొంత నిధులతో ప్రజా హితం ఎన్నో సేవా కార్యక్రమాలను చేశారని పాఠశాలలందు జాతీయ నాయకులు చిత్రపటాలు, వాటర్ క్యాన్ లు, మెడికల్ కిట్స్, ఆటవస్తువులు , నోట్ పుస్తకాలు,బెంచీలు, మెడికల్ క్యాంప్లు, రక్త దాన శిబిరాలు, బ్లైండ్, మెంటల్ రిటైర్డ్, మూగ, చెవిటి విద్యార్థుల పాఠశాలలో వారికి అవసరమాకు సామాగ్రిని అందించి ఇప్పటికే పర్యావరణ కొరకు లక్ష సంచులకు పైన అందజేశారని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీరిని ప్రత్యేకంగా అభినందించారని ముందు భవిష్యత్తులో ఎన్నో సాధించాలని అభినందించారు.

## ఉద్యమకారులకు హామీలు అమలు చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించి, హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ అన్నారు. హైదరాబాదు ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో గురువారం తెలంగాణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నరాల సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో త్యాగాలు చేసిన వారికి తగిన గౌరవం, హక్కులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 250 గజాల ఇళ్ల స్థలాలు, రూ.25 వేల పెన్షన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను సమీక్షించి ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. అన్ని జేఏసీలతో చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.మోతె శోభన్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేసుల పరిశీలన ద్వారా ఉద్యమకారులను గుర్తించడం సాధ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు శంకర్ గౌడ్ చలమల నరసింహా, జి రాజేశం, చిలుక శంకర్, కోడిపుంజుల జ్యోతి, ఉమా రమాదేవి, అనుముల కళావతి, సులోచన రావు , భాగ్యమ్మ, నరేష్, ఎస్.కె ముస్తఫా, నాగేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్ తండ్రి ముద్దగౌని యాదయ్య గౌడ్ మరణించిన విషయం తెలుసుకొని వారి నివాసంలో యాదయ్య గౌడ్ పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించిన గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ల రామ్ నరసింహ గౌడ్.

(విశ్వంభర, వనస్థలిపురం)

## సమస్యలు పరిష్కరించాలంటూ జోనల్ కమిషనర్ కు వినతి

**విశ్వంభర, బడంగ్‌పేట్ :** మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 58, 59, 60 డివిజన్ల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ బడంగ్‌పేట్ సర్కిల్ బిఆర్ఎస్ నాయకులు శంషాబాద్ జోనల్ కమిషనర్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రా రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. కాలనీలలో నిలిచిపోయిన సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సమస్యల పరిష్కారం. సాయి నగర్ కాలనీ, లెనిన్ నగర్ స్మశాన వాటికల తక్షణ అభివృద్ధి.రాబోయే ఆషాడ మాస బోనాల జాతర సందర్భంగా మూడు డివిజన్లలోని దేవాలయాల మరమ్మత్తులు. భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్, త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు జటావత్ శీను నాయక్, ఏసుగుల అనిల్ కుమార్ యాదవ్, దిండు భూపేష్ గౌడ్, మాదారి రమేష్, దోమలపల్లి రాజకుమార్, జిల్లా విజయ్ కుమార్, గోపి యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఎల్‌నినో ముప్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రమత్తం కావాలి

### మాజీ కార్పొరేషన్ చైర్మన్ జి. దేవీప్రసాద్

**విశ్వంభర, హైదరాబాద్ :** ఈ ఏడాది ఖరీఫ్ కాలంలో తెలంగాణ రాష్ట్రంతో పాటు 12 రాష్ట్రాలపై ఎల్ నినో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో తీవ్రమైన వాతావరణ సవాళ్లను ఎదుర్కొనే ప్రమాదం ఉందని వాతావరణ నిపుణులు కూడా హెచ్చరిస్తున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలి అని మాజీ కార్పొరేషన్ చైర్మన్ జి. దేవీప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షపాతం అసమానంగా నమోదయ్యే అవకాశం ఉందని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఇటువంటి పరిస్థితులు రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు సాగునీరు, తాగునీటి రంగాల్లో కూడా సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంది అని అన్నారు. దక్షిణ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షపాతం లోటు నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు ముందస్తు సూచనలు జారీ చేయాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అధిక నీరు అవసరమయ్యే పరి సాగు విషయంలో శాస్త్రీయ ప్రణాళికతో ముందుకు వెళ్లాలి, ప్రత్యామ్నయ పంటలను మద్దతు ధరకు కొనుగులు చేస్తామని ప్రభుత్వం ప్రకటించాలి అని అన్నారు. కృష్ణా, గోదావరి నదుల పరివాహక ప్రాంతాల్లో వర్షాభావం కొనసాగితే శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల వంటి ప్రధాన జలాశయాలకు నీటి ప్రవాహాలు తగ్గే ప్రమాదం ఉంది,ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నీటి నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, అనుసంధానిత రిజర్వాయర్లు మరియు చెరువులను నింపే వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమర్థవంతంగా పనిచేస్తే కరువు పరిస్థితులను గణనీయంగా ఎదుర్కొనే అవకాశం ఉంది.రైతుబంధు, పంటల కొనుగోలు, పంట బీమా, వ్యవసాయ ఇన్‌పుట్ల సరఫరా, తాగునీటి భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రైతాంగానికి భరోసా కల్పించాలని కోరుతున్నాం. రైతు సంక్షేమమే తెలంగాణ అభివృద్ధికి పునాది. రైతాంగాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని అన్నారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS ప్రజా విశ్వంభర "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108